నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల వనపర్తి
8 | మహబూబ్‌నగర్, శనివారం 24 మే 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

పొలంలో దుక్కులు దున్నుతున్న రైతు (ఫైల్)

కోటి ఆశలతో..

- వానకాలం సాగుకు రైతన్న సమాయత్తం
- దుక్కులు దున్నే పనిలో రైతులు నిమగ్నం
- ప్రణాళికలు సిద్ధం చేసిన వ్యవసాయాధికారులు
- కందనూల్‌లో అత్యధికంగా 5.38 లక్షలు, పేటలో అత్యల్పంగా 2.35 లక్షలు

గద్వాల, మే 23 : కోటి ఆశలతో వానకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. గతేడాది ఆశించిన స్థాయిలో పంటల దిగుబడి రాలేదు. దీంతో ఈ ఏడాదైనా కాలం కలిసి వస్తుందనే ఆశతో పొలాలను సిద్ధం చేస్తున్నారు. వానకాలం పంటలకు సంబంధించి జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ప్రధాన ప్రాజెక్టులైన తుమ్మిళ్ల, ఆర్డీఎస్, జూరాల, నెట్టెంపాడ్ ప్రాజెక్టులు ఉన్నాయి. దీనికి తోడు బోరుబావుల్లో నీటిశాతం పెరగడంతో సాగు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. దీనికి తోడు బీఆర్ఎస్ సర్కారులో ప్రతి 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేసి వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించడంతో వారి సలహాలు, సూచనలు రైతులకు అందడంతో సాగు పెరగడానికి మరో కారణంగా చెప్పవచ్చు.

జిల్లాలో ప్రధాన పంటల సాగు..

జోగుళాంబ గద్వాల జిల్లాలో వానకాలంలో ఎక్కువగా పత్తి, వరి, వేరుశనగ, పెసర, మొక్కజొన్న, కంది, ఆముదం, పొద్దుతిరుగుడు, అనుములు, మిర్చి, ఉల్లి తదితర పంటలు సాగు చేస్తారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల పరిధిలోని 13మండలాలకు సంబంధించిన సాగుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. గత వానకాలంలో జిల్లాలో 3,70,390 ఎకరాల్లో పంటలను సాగుచేశారు. ఈ వానకాలం 3,67,211 ఎకరాల్లో సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. ఈ అంచనా మరింత పెరిగే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియానాయక్ తెలిపారు. 1,42,410 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తారని అంచనా వేశారు. వరి 95,762 ఎకరాల్లో, మొక్కజొన్న 12,887 ఎకరాలు, వేరుశనగ 11,180, కందులు 42,585, ఆముదాలు 1,031, పొగాకు 10,878, బ్లాక్‌గ్రామ్ 1,160 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. దీంతోపాటు హార్టికల్చర్ పంటలైన మిరప 30,305 ఎకరాల్లో, ఆయిల్‌పాం 3,936, ఇతర పంటలు 11,665 ఎకరాల్లో రైతులు సాగు చేయనున్నారు. వ్యవసాయ పంటలు 3,21,305 ఎకరాల్లో, వాణిజ్యపంటలు 45,906 ఎకరాల్లో సాగు చేయనున్నారు.

1,18,586 మెట్రిక్ టన్నుల ఎరువులు

వానకాలానికి సంబంధించి మొత్తం 1,18,586 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అధికారులు అంచనా వేశారు. యూరియా 36,078 మెట్రిక్ టన్నులు, డీఏపీ 13,234, పొటాష్ 6,815, ఏఎస్ 2,669, సూపర్‌ఫాస్ఫెట్ 6,615, కాంప్లెక్స్ ఎరువులు 53,173 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇందులో ప్రస్తుతం యూరియా 15,442 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1,694, సూపర్ ఫాస్ఫెట్ 759, పొటాష్ 1,738, కాంప్లెక్స్ ఎరువులు 18,009 టన్నులు అవసరం కాగా, మొదటి విడుత అవసరమైన 37,644 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయి.

కోటి ఆశలతో వానకాలం సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. గతేడాది ఆశించినంతగా పంటల దిగుబడి రాక పోవడంతో దిగాలు చెందిన రైతన్న ఈ ఏడాదైనా విస్తారంగా వర్షాలు కురిసి పసిడి పంటలు పండాలని కోరుకుంటున్నాడు. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 17,70,503 ఎకరాల్లో పత్తి, వరి, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ ఇతర పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 5,38,462 ఎకరాల్లో సాగు చేయనుండగా, అత్యల్పంగా నారాయణపేట జిల్లాలో 2,35,000 సాగు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పత్తి, వరిపైనే అధిక ఆసక్తి..

జిల్లాలో అధికంగా రైతులు పత్తి 1,42,410 ఎకరాలు, వరి 95,762 ఎకరాల్లో సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పత్తికి మద్దతు ధర ఇస్తుండడంతోపాటు మార్కెట్‌లో ఎక్కువ ధర పలుకుతుండడంతో పత్తి సాగుపై మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయ అధికారులు కేవలం నల్లరేగడిలో మాత్రమే పత్తి పంట సాగు చేయాలని సూచిస్తున్నా రైతులు అన్ని పొలాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. అలాగే వరికి మద్దతు ధర బోనస్ ఇస్తుండడంతో ఆసక్తి కనబరుస్తున్నారు.

జిల్లా	ఎకరాల్లో సాగు అంచనా
జోగుళాంబ గద్వాల	3,67,211
వనపర్తి	2,83,265
నాగర్‌కర్నూల్	5,38,462
నారాయణపేట	2,35,000
మహబూబ్‌నగర్	3,46,830

ఎరువులు, విత్తనాలు సిద్ధం

జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేస్తున్నాం. కొనేటప్పుడు తప్పనిసరిగా రైతులు దుకాణదారులతో రశీదు తీసుకోవాలి. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో విత్తనాలు అమ్మడానికి వస్తే ఎవరూ కొనుగోలు చేయొద్దు. అటువంటి వారి సమాచారం ఇవ్వాలి. నాసిరకం విత్తనాలు కొని మోసపోవద్దు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేశాం.

- సక్రియా నాయక్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, జోగుళాంబ గద్వాల

పత్తికి ప్రాధాన్యం

- నాగర్‌కర్నూల్ జిల్లాలో 2.86 లక్షల సాగు అంచనా
- మొత్తం విస్తీర్ణం 5.91 లక్షల ఎకరాలు

నాగర్‌కర్నూల్, మే 23 : నాగర్‌కర్నూల్ జిల్లాలో వానకాలం సాగు ప్రణాళికలను వ్యవసాయాధికారులు సిద్ధం చేశారు. గతేడాదికంటే ఈసారి సాగు విస్తీర్ణం స్వల్పంగా పెరగనున్నట్లు అధికారుల అంచనాలను బట్టి తెలుస్తోంది. హార్టికల్చర్‌ను మినహాయిస్తే 5,38,462 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. గతేడాది 4,35,692 ఎకరాల్లో పంటలు సాగవగా, ఈఏడాది స్వల్పంగా పెరగనున్నది. పత్తి అధికంగా 2,86,471 ఎకరాల్లో సాగు చేయనున్నారు. గతేడాది 2,20,449 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి 66వేల ఎకరాల్లో పెరగనున్నది. వరి 1,60,021 ఎకరాల్లో సాగు చేయనున్నారు. గతేడాది 1,56,977 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి 3వేల ఎకరాల్లో సాగు పెరగనున్నది. మొక్కజొన్న గతేడాది 41,752 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి 72,929 ఎకరాల్లో సాగు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. మొక్కజొన్న 31,177 ఎకరాల్లో, జొన్నలు 7,822, కందులు 8,909, పెసర్లు 368, ఆముదం 239, వేరుశనగ 895 ఎకరాల్లో ఈసారి సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనాలు వేశారు. హార్టికల్చర్ సైతం 52,603 ఎకరాల్లో సాగవనున్నాయని, గతేడాది 51,320 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి 1,283 ఎకరాలు అధికంగా సాగు చేయనున్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

ఈవానకాలానికి సంబంధించిన అవసరమైన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఉంచుతున్నట్లు వ్యవసాయాధికారులు వెల్లడించారు. 2,865 క్వింటాళ్ల పత్తి విత్తనాలు, వడ్లు 40వేల క్వింటాళ్లు, కందులు 267, మొక్కజొన్న 5,834, వేరుశనగ 850, జొన్నలు 313, ఆముదం 10, పెసర్లు 26 క్వింటాళ్ల చొప్పున విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. 808 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేసేందుకు 8క్వింటాళ్ల విత్తనాలను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు.

వరి వైపే మొగ్గు

వనపర్తి, మే 23(నమస్తే తెలంగాణ) : వచ్చే వానకాలం సీజన్‌లో వరి సాగుబడుల వైపే రైతన్నలు మొగ్గు చూపుతున్నారు. వానకాలం పంటల సాగుపై వ్యవసాయ శాఖ దృష్టి పెట్టింది. ఈ మేరకు 1,13,306 హెక్టార్లలో వివిధ రకాల పంటల సాగు జరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో అధికభాగం వరి సాగుబడులే ఉండడం ద్వారా వరి సాగుబడుల వైపే రైతన్నల అడుగులు అన్నట్లు కనిపిస్తుంది. 82,400హెక్టార్లలో వరి సాగవుతుందని అంచనా వేశారు. పది రకాల పంటల సాగు చేయనున్న క్రమంలో అధిక భాగం వరి శిస్తు ఉంది. వచ్చే వానకాలంలో శిస్తు చేయనున్న పంటల వివరాలు ఇలా ఉన్నాయి. ఇదిలా ఉంటే.. గత ఏడాది వానకాలంలో 78,200 హెక్టార్లలో వరి శిస్తు అంచనా ఉండింది. దీన్ని బట్టి వచ్చే వానకాలం సీజన్ మరింత పెరుగుతుందన్న అంచనా కనిపిస్తున్నది.

పంట	హెక్టార్లలో..
వరి	82,400
పత్తి	3,803
వేరుశనగ	3,312
మొక్కజొన్న	3,803
కందులు	2,852
జొన్నలు	812
చెరుకు	545
మినుములు	438
ఆముదం	169
పెసర	20
ఉద్యాన పంటలు	12,769
ఇతర పంటలు	2,383
మొత్తం	1,13,306

పేటలో 3.46 లక్షల ఎకరాల్లో

పాలమూరు, మే 23 : మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 2025-26 సంవత్సరానికి 3,46,830 ఎకరాల్లో యాసంగి పంట సాగు చేయనున్నట్లు జిల్లా వ్యసాయశాఖ అధికారులు అంచనా వేశారు. గతేడాదికి మించి 15,332 ఎకరాల్లో అధికంగా సాగు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. వరి గతేడాది 1,94,962 ఎకరాలు సాగు చేయగా, ఈ ఏడాది 2లక్షలు, మొక్కజొన్న 30వేలు, జొన్న 18వేలు, రాగులు 150, పత్తి 85వేలు, ఆముదాలు 330, నువ్వులు 50, కందులు 10వేలు, ఇతర పంటలు 3,300 ఎకరాలు సాగు చేయనున్నట్లు అంచనా వేస్తున్నారు. పంటలకు సరిపడా విత్తనాలు,ఎరువులు యూరియా 6891.93 టన్నులు, డీఏపీ 3408.61, ఎంవోపీ 202.35, ఎస్ఎస్‌పీ 448.55, కాంప్లెక్స్ 22,335.2 టన్నుల ఎరువులు అవసరమవుతారని చెబుతున్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు చేపట్టాలి

విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలి. కొనుగోలుకు ఖచ్చితంగా రశీదు తీసుకోవాలి. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు. రైతులకు ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి.

- వెంకటేశ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, మహబూబ్‌నగర్

మెరవనున్న తెల్లబంగారం

నారాయణపేట, మే 23 : జిల్లాలో వానకాలం పంటల సాగులో పత్తి పంట వైపు రైతులు మొగ్గు చూపుతారని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ వానకాలం సీజన్‌లో జిల్లాలో లక్షా 80వేల ఎకరాల్లో పత్తి, లక్షా 75వేల ఎకరాల్లో వరి, 70వేలు కంది, 5వేలు జొన్న, 5వేల ఎకరాల్లో పెసర పంటను సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు.

నష్టపరిహారంపై స్పష్టమైన హామీ ఇవ్వాలి

- కాట్రేవుపల్లిలో భూ సర్వేను అడ్డుకున్న రైతులు
- వెనుదిరిగిన రెవెన్యూ అధికారులు

మక్తల్, మే 23 : కొడంగల్- నారాయణపేట ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని మండలంలోని కాట్రేవుపల్లి, ఎర్నాగనిపల్లి రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కాట్రేవుపల్లి, ఎర్నాగన్‌పల్లి గ్రామ శివారులో భూముల హద్దులు నిర్ణయించడానికి వచ్చిన నీటి పారుదల, రెవెన్యూ శాఖ అధికారులను రైతులను అడ్డుకున్నారు. దీంతో అధికారులు రైతులకు సర్ది చెప్పేందుకు ప్రయత్నించినా వారు పట్టించుకోకపోవడంతో చేసేది లేక తిరుగుముఖం పట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మక్తల్ మండలం భూత్పూర్ రిజర్వాయర్ నుంచి కొడంగల్ నియోజకవర్గానికి నీటిని తీసుకువెళ్లేందుకు, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణం పేరుతో భూములను తీసుకోవాలని ప్రభుత్వం చూస్తే మా భూములను ప్రాజెక్టు నిర్మాణం కోసం అప్పనంగా ఇచ్చేందుకు సిద్ధంగా లేమని తేల్చిచెప్పారు. గతంలోనే భూత్పూర్ రిజర్వాయర్ నిర్మాణంలో కాట్రేవుపల్లి గ్రామానికి చెందిన రైతులు 70% భూమి కోల్పోవడం జరిగిందని రైతులు వాపోయారు. మళ్లీ నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణంతో గ్రామ శివారులో మిగిలి ఉన్న కాస్తంత భూమిని మరో ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం తీసుకుంటామంటే వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న మేము ఎక్కడివెళ్లి బతకాలని అధికారులను నిలదీశారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు తీసుకుంటాం, సర్వేలు చేస్తామని చెప్తున్నారు తప్పా భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నుంచి ఎంత నష్టపరిహారం ఇస్తారో, రైతులకు భూమికి భూమి ఇస్తారా, లేక పరిహారాన్ని చెల్లిస్తారు అన్న విషయాలన్ని అధికారులు రైతులకు చెప్పకుండా పోలీసు బలగాలతో వచ్చి బలవంతంగా రైతుల భూములు సర్వే చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా అధికారులు మా భూములు కావాలంటే ప్రభుత్వం ప్రస్తుత మార్కెట్ ప్రకారం నష్టపరిహారం ఇవ్వడంతోపాటు ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం ఇచ్చేందుకు ముందుకు వస్తేనే మా భూములను ఇస్తామని లేదంటే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

అధికారులను అడ్డుకుంటున్న రైతులు

భూ సేకరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

నెట్టెంపాడు భూసేకరణ వేగిరం చేయాలి

- జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల అర్బన్, మే 23 : జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూసేకరణను వేగవంతం చేయాలని జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. ధరూర్ మండలం చింతరేవుల గ్రామాన్ని కలెక్టర్ సందర్శించి జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ, లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేల్యాండ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భూ సేకరణ వేగవంతం చేయాలని సూచించారు.

తాగునీటికి తప్పని తిప్పలు

- మూడు రోజులుగా నిలిచిన మిషన్ భగీరథ నీరు
- ఇబ్బందులు పడుతున్న అనంతవరం ప్రజలు

బల్మూరు, మే 23 : మండలంలోని అనంతవరం గ్రామానికి గత మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి కోసం గ్రామంలో ఉన్న చేతిపంపులను ఆశ్రయిస్తుండగా కొందరూ దూరంగా వ్యవసాయ పొలాల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న పరిస్థితి నెలకొన్నది. గ్రామాల్లో ప్రస్తుతం వివాహాది శుభకార్యాలయాలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు తాగునీటికి మరిన్ని ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలు ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నా గ్రామ ప్రత్యేకాధికారి ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీనిపై మిషన్ భగీరథ ఏఈ మధుబాబుని వివరణ కోరగా తెలకపల్లి మండలంలోని రాకొండ వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడిన కారణంగా మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందని, త్వరలో మరమ్మతులు నిర్వహించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని చెప్పారు.

అనంతవరంలో తాగునీటి కోసం బిందెలు, బకెట్లతో ప్రజలు

ట్రాఫిక్‌ను క్లియర్ చేసిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం

వాహనాలను పంపిస్తున్న చిట్టెం

మక్తల్, మే 23 : రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తన వాహనాన్ని ఆపి ట్రాఫిక్ క్లియర్ చేసిన ఘటన శుక్రవారం ఉదయం మక్తల్ మున్సిపాలిటీలో చోటు చేసుకున్నది. శుక్రవారం ఉదయం మక్తల్ మున్సిపాలిటీలోని సంగం బండ రోడ్డులో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ఓ శుభకార్యానికి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ట్రాఫిక్ జామ్‌ను గమనించి వెంటనే వాహనం దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎప్పుడు రద్దీగా ఉండే సంగం బండ రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని పోలీసులు అందుబాటులో ఉండి ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని సూచించారు.

గోప్లాపూర్‌లో నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

జడ్చర్లటౌన్, మే 23 : మండలంలోని గోప్లాపూర్ గ్రామంలో శుక్రవారం వ్యవసాయశాఖ, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి 30కిలోలు నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. జడ్చర్ల సీఐ కమలాకర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గోప్లాపూర్ గ్రామంలో మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి తన ఇంట్లో అక్రమంగా నకిలీ పత్తివిత్తనాలను నిల్వ చేసినట్లు సమాచారం తెలుసుకున్న వ్యవసాయశాఖాధికారులు కృష్ణకిశోర్, వెంకటేశ్, గోపినాథ్‌తో పాటు పోలీసులు సంయుక్తంగా శుక్రవారం ఉదయం గోప్లాపూర్ గ్రామానికి వెళ్లి మధుసూదన్‌రెడ్డి ఇంట్లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో దాదాపు రూ.75వేలు విలువ కలిగిన 30కిలోలు నకిలీ పత్తి విత్తనాలు నిల్వ ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడు మధుసూదన్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

యూపీఎస్సీ ఫలితాల్లో 25వ ర్యాంక్

ప్రశాంత్

జడ్చర్లటౌన్, మే 23 : పట్టణానికి చెందిన యువకుడు ప్రశాంత్ ఇటీవల విడుదలైన యూపీఎస్సీ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో 25వ ర్యాంకు సాధించాడు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్(ఐఎఫ్ఎస్) లో 25వ ర్యాంకు సాధించటంపై జడ్చర్ల మాదిగ ఉద్యోగుల సమాఖ్య సభ్యులు అభినందనలు తెలియజేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 143 మంది ఎంపికకాగా తెలుగు రాష్ట్రాలకు చెందిన 15మంది ఉండగా, వారిలో జడ్చర్లకు చెందిన యువకుడు ప్రశాంత్ ఎంపికైనట్లు మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు కావలి కృష్ణ తెలిపారు.

నల్లమలలో అడవిదున్న ప్రత్యక్షం

అచ్చంపేట, మే 23 : నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అటవీప్రాంతంలో అనుకోని అతిథి కనిపించింది. నల్లమల ప్రాంతంలో ఫరహాబాద్ చెక్‌పోస్టు నుంచి కిలోమీటరు దూరంలో అప్పాపూర్-ఫరహాబాద్ వ్యూపాయింట్‌కు వెళ్లే దారిలో అరణ్యవీరుడు అడవిదున్న ప్రత్యక్షమైంది. మన్ననూర్ ఐటీడీఏలో ఏఈగా పనిచేస్తున్న రఘు అప్పాపూర్‌లో రాష్ట్ర గవర్నర్ నిధుల ద్వారా జరుగుతున్న చెక్‌డ్యాం నిర్మాణ పనులు, గిరిజన ఆశ్రమ పాఠశాలలో బాత్‌రూం మరమ్మతు పనులు పరిశీలించేందుకు శుక్రవారం ఉదయం కారులో అప్పాపూర్‌కు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా ఫరహాబాద్ చెక్‌పోస్ట్‌కు(పులిబొమ్మ) కిలోమీటర్ దూరంలో గడ్డి తింటూ అడవిదున్న కనిపించింది. మొదటగా ఎలుగుబంటి అనుకొని భయపడిన ఏఈ రఘు కొద్దిసేపటికి జంతువు తలపైకెత్తి చూడగా కొమ్ములు కనిపించాయి. కాస్త దగ్గరికెళ్లి చూడగా అడవిదున్న కనిపించింది. ఆ దృశ్యాన్ని తనఫోన్‌లో బంధించి చెక్‌పోస్టు వద్ద ఉన్న అటవీ సిబ్బందికి విషయం తెలుపగా మొదట్లో వారు కూడా నమ్మలేదు. అడవిదున్న ఇక్కడ ఎందుకుంటుందని, నీలిగాయి ఉండొచ్చని భావించిన అటవీ సిబ్బంది ఫొటోను పరిశీలించి కొమ్ములు, శరీర ఆకృతి చూసి అడవిదున్నగా నిర్ధారించుకొని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అనంతరం అక్కడి నుంచి సిబ్బంది కెమెరాలు తీసుకొని అడవిదున్న కోసం వెళ్లినట్లు ఏఈ రఘు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. గతేడాది ఒకసారి కనిపించిన అడవిదున్న మళ్లీ ఏడాది తర్వాత నల్లమలలో తిరిగి కనిపించడంతో అటవీ సిబ్బంది, ప్రకృతి ప్రేమికులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

155 ఏండ్ల తర్వాత..

స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిషర్ల కాలంలో 1870లో నల్లమల అటవీ ప్రాంతంలో అడవిదున్న చివరిసారిగా కనిపించినట్లు రికార్డులు చెబుతున్నాయి. అప్పటి నుంచి నల్లమలలో అడవిదున్న జాడ లేకుండా పోయింది. 155 ఏండ్ల తర్వాత అరుదైన జంతువు అడవిదున్న నల్లమలలో ప్రత్యక్షమైంది. అత్యంత శక్తివంతమైన అడవి జంతువుల్లో అడవిదున్న ఒకటి. పెద్ద శరీరం, బలమైనకాళ్లు, గట్టి పాదాలు, మెరిసే నల్లని చర్మం, మగ దున్న అయితే 800 నుంచి 1000 కిలోల బరువు ఉంటుంది. ఎత్తు భూజాల వద్ద దాదాపు 6అడుగులు, పొడవు 8 నుంచి 10 అడుగులు ఉంటుంది. తల వెడల్పుగా, బలంగా ఉంటుంది. రెండు కొమ్ములు తలపైభాగం నుంచి పైకి అర్ధచంద్రకారంగా ఉంటాయి. సుమారు 20 నుంచి 25 ఏండ్లవరకు జీవించే అవకాశం ఉంది. కర్ణాటక, కేరళ, తమిళనాడు, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌లో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి.

నల్లమల అడవిలో సంచరిస్తున్న అడవి దున్న

ఉన్నత విద్య అభ్యసించేందుకు డాక్టర్ రాజీనామా

నాగర్‌కర్నూల్, మే 23 : జిల్లా జనరల్ దవాఖానలో ఆర్థో డాక్టర్‌గా పనిచేస్తున్న అఖిల్ ఉన్నత విద్య అభ్యసించేందుకు విధులకు రాజీనామా పెట్టి వెళ్లిపోయారని దవాఖాన సూపరింటెండెంట్ రఘు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. దవాఖానలో అసౌకర్యాలు, ఒత్తిడిలకు లోనై రాజీనామా చేస్తున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు. ఉన్నత విద్య చదవడానికి తాను చేస్తున్న ఉద్యోగాన్ని మానుకోవాల్సి వస్తుందని, అందుకే విధుల నుంచి తప్పుకున్నాడన్నారు. అఖిల్ ఇచ్చిన రాజీనామా పత్రాన్ని మెడికల్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవికి అందజేయడం జరిగిందని, ఉన్నత విద్యకోసమని చెప్పినందుకే ప్రిన్సిపాల్ ఆమోదం తెలిపారన్నారు. అసౌకర్యాలు, అవమానాలు జరిగినట్లుగా వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని ఆయన పేర్కొన్నారు.

టీబీ డ్యాం, ఆర్డీఎస్‌కు కొనసాగుతున్న వరద

అయిజ, మే 23 : కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు జీవనాడిగా ప్రసిద్ధి చెందిన తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతున్నది. గత కొన్ని రోజులుగా టీబీ డ్యాం ఎగువ ప్రాంతాల్లో వానలు కురుస్తుండటంతో వరద స్వల్పంగా చేరుతున్నది. శుక్రవారం ఇన్‌ఫ్లో 5,360 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 2,082 క్యూసెక్కులు నమోదైంది. టీబీ డ్యాం 100.855 గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 10.458 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1589.30 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. అలాగే కర్ణాటకలోని ఆర్డీఎస్ (రాజోళి బండ డైవర్సన్ స్కీం) ఆనకట్టకు వరద నీరు చేరుతున్నది. ఎగువన కురిసిన వానలకు శుక్రవారం 17,952 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, 17,952 క్యూసెక్కులు దిగువన ఉన్న సుంకేసుల బరాజ్‌కు చేరుతోందని ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 9 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నీరు ఆరంభం కావడంతో ఆర్డీఎస్ రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.